పత్రాలు చూపించి ద్విచక్ర వాహనాలు తీసుకెళ్లండి

నాగోలు: ఎల్‌బీనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన గుర్తు తెలియని 45 ద్విచక్ర వాహనాలు స్టేషన్ ఆవరణలో ఉన్నాయని ట్రాఫిక్ సీఐలు జగదీష్, నాగరాజుగౌడ్‌లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ వాహనాల యజమానులు సరైన ప్రతాలు చూపించి వాటిపై ఉన్న చలాన్లు క్లియర్ చేసి తీసుకెళ్లాలని సీఐలు సూచించారు. స్టేషన్‌లో ఉన్న వాహనాల యజమానులకు ఇప్పటికే నోటీసులు ఇచ్చి సమాచారం తెలియజేశామన్నారు. ఇతర వివరాల కోసం 040-27853927 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సీఐలు కోరారు.

స్వాతి రెసిడెన్సీకాలనీ అధ్యక్షుడిగా మహేందర్‌రెడ్డి


మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న కాలనీవాసులు

మన్సూరాబాద్: డివిజన్ హయత్‌నగర్ పరిధిలోని స్వాతి రెసిడెన్సీ సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం కాలనీలో సమావేశమై నూతన అధ్యక్షుడిగా లయన్ ఎ.మహేందర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిని కాలనీవాసులు శాలువాలతో సత్కరించారు. త్వరలోనే కాలనీవాసులతో చర్చించి పూర్తి కార్యవర్గాన్ని నియమించనున్నట్లు నూతన అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తెలిపారు.

కాశీ విశ్వనాథ్ ఆలయ ప్రధాన అర్చకుడికి సన్మానం


శ్రీకాంత్ మిశ్రా గురుజీని సత్కరించిన కార్పొరేటర్ నర్సింహారెడ్డి తదితరులు

మన్సూరాబాద్: వారణాసిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాశీ విశ్వనాథ్ ఆలయ ప్రధాన అర్చకుడు డాక్టర్ శ్రీకాంత్ మిశ్రా గురుజీని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆదివారం సత్కరించారు. డివిజన్‌లోని బొమ్మలగుడి సమీపంలో కరుణాకర్ నూతన గృహ ప్రవేశ పూజా కార్యక్రమానికి శ్రీకాంత్ మిశ్రా గురుజీ హాజరయ్యారు. గురుజీని కార్పొరేటర్ సత్కరించి ఆశీస్సులు అందుకున్నారు. నాయకులు సాయిరాం గౌడ్, పారంద సాయి తదితరులు పాల్గొన్నారు.

సహారా స్టేట్స్‌కాలనీలో చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకటాద్రి

మన్సూరాబాద్: డివిజన్ పరిధి సహారాస్టేట్స్ కాలనీలోని ప్రధాన గేట్ వద్ద బీజేపీ ఎల్‌బీనగర్ నియోజకవర్గం స్వచ్ఛభారత్ కన్వీనర్ గంగదాసు కృష్ణారెడ్డి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం కాలనీ సీనియర్ సిటిజన్ వెంకటాద్రి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీ నిర్వహణ కమిటీ మాజీ అధ్యక్షుడు సయ్యద్ జానీ, బీజేపీ మన్సూరాబాద్ అధ్యక్షుడు నాంపల్లి రామేశ్వర్, కాలనీవాసులు ప్రభాకర్‌రెడ్డి, వేముల ఆనంద్, శ్రీనయ్య, సుదర్శన్‌రెడ్డి, లోకనాథం, డా.వెంకటేశ్వర్లు, పెంటయ్య, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ



లింగోజిగూడ: రంజాన్ సందర్భంగా కందికంటి భాగ్యాలు శంకరయ్యగౌడ్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కందికంటి శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం సరూర్‌నగర్ గౌడ సంఘం భవనంలో ముస్లిం మహిళలకు చీరల పంపిణీ చేశారు. సుమారు 200 మందికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చీరలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కోట్ల శ్రీనివాస్, బి.ఆనంద్‌గౌడ్, ప్రేంనాథ్‌గౌడ్, వెంకటేశ్, సాకేత్, జాఫర్, సర్వర్, షబ్బీర్, కందికంటి రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


ఖేలో ఇండియా ఉమెన్స్ సైక్లింగ్ లీగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా

నాగోలు: క్రీడల మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. ఆదివారం నాగోల్ బండ్లగూడలోని సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ ఆవరణలో ఖేలో ఇండియా ఉమెన్స్ సైక్లింగ్ లీగ్ (సౌత్ జోన్ హైదరాబాద్) పోటీలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆటల పోటీలు క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తాయని, గెలుపు ఓటములు ముఖ్యం కాదని, ప్రతి ఆటను క్రీడా స్ఫూర్తితో తీసుకోవాలన్నారు. ఈ పోటీల్లో తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన 75 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఖేలో ఇండియా ఉమెన్స్ సైక్లింగ్ లీగ్ సౌత్ జోన్ కో ఆర్డినేటర్ డా. మాక్స్వెల్ ట్రావెర్, పాషా, శ్రీకాంత్,తదితరులు పాల్గొన్నారు

పరామర్శ

మహేశ్వరం: పెండ్యాల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మదిల పురం మహేందర్‌రెడ్డి తల్లి ప్రేమలమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆదివారం జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ప్రేమలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని కోరుకున్నామని అనితారెడ్డి, కృష్ణారెడ్డిలు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు మదిలపురం నరేందర్‌రెడ్డి, జైత్వారం జగన్‌మోహన్‌రెడ్డి, నారాయణ రెడ్డి, విజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్


అక్బర్‌బాగ్ సెయింట్ పీటర్ లూథరన్ చర్చిలో ఈస్టర్ వేడుకలు


మూసారంబాగ్ బేతనీయ చర్చిలో ప్రసంగిస్తున్న పాస్టర్


క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చిలో ప్రసంగిస్తున్న పాస్టర్ ప్రభుచరణ్


బాప్టిస్టు చర్చిలో ఈస్టర్ సందేశమిస్తున్న పాస్టర్ బోడ సాల్మన్


వనస్థలిపురంలోని లిటిల్ ల్యాంబ్ చర్చిలో...

మలక్‌పేట: మలక్‌పేట నియోజకవర్గ పరిధిలోని చర్చిలలో ఆదివారం ఈస్టర్ ఆరాధనలు ఘనంగా నిర్వహించారు. యేసుక్రీస్తు శిలువలో పరమ పదించిన మూడు రోజుల తర్వాత.. అంటే ఆదివారం ఆయన మళ్లీ ప్రాణాలతో లేచిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ ఈస్టర్ పండుగను జరుపుకున్నారు. మూసారంబాగ్ క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చి, బేతనీయ చర్చి, దిల్‌సుఖ్‌నగర్ బాప్టిస్టు చర్చి, అక్బర్‌బాగ్ సెయింట్ పీటర్ లూథరన్ చర్చి, హోరేబు చర్చిల్లో వేడుకల నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే చర్చీల్లో భక్తులు కొవ్వొత్తులు వెలిగించారు. పాస్టర్లు ఈస్టర్ సందేశాన్ని అందించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు పునరుత్థానాన్ని గుర్తు చేస్తూ పాటలు పాడారు. క్రైస్తవులు ఒకరికొకరు ఈస్టర్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

లిటిల్ ల్యాంబ్‌లో..

వనస్థలిపురం: వనస్థలిపురంలోని లిటిల్ ల్యాంబ్ చర్చిలో ఈస్టర్ వేడుకలు జరుపుకున్నారు. చర్చి పాస్టర్ రెవ. డా. కె.సుదర్శన్‌రావు, గెస్ట్ స్పీకర్ పాస్టర్ జెల్లా రాజ్‌కుమార్ ఈస్టర్ ప్రాముఖ్యతను వివరించారు. చర్చి కమిటీ ప్రతినిధులు టీఎస్ బాబూరావు, జార్జిముల్లర్, భానుకిరణ్, ఎన్.జాన్, సురేష్‌కుమార్, రఘురాం, జాకబ్ ప్రసాద్, విజయలక్ష్మి లాజరస్, వందలాది మంది సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి చర్యలు


నల్లపోచమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న జంగం మధుకర్‌రెడ్డి

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఐఎస్‌సదన్‌లోని దామోదర సంజీవయ్యనగర్ కాలనీలోని నల్లపోచమ్మ ఆలయం 9వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే కాలనీవాసులు, భక్తులు ఆలయానికి చేరుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసింది. పూజల్లో పాల్గొన్న మధుకర్‌రెడ్డిని ఆలయ కమిటీ వారు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రశాంత్, హరి, సాయి, రమేష్ పాల్గొన్నారు.

భగవద్గీత పారాయణం


భగవద్గీత పారాయణం చేస్తున్న భక్తులు

మన్సూరాబాద్: నాగోలు డివిజన్ పరిధి శ్రీసాయినగర్ కాలనీలోని శ్రీదుర్గాదేవి ఆలయంలో ఆదివారం భగవద్గీత పారాయణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేష్ యాదవ్, పురోహితులు బాల మురళీశర్మ, కాలనీవాసులు యాదగిరి, హనుమంతరావు, రవి, రమేష్, అశోక్, మురళీ, కృష్ణమూర్తి, రమణమూర్తి, కేశవులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం


ఉత్సవాలకు ముస్తాబైన వేంకటేశ్వరస్వామి ఆలయం

మన్సూరాబాద్: డివిజన్ పరిధి విజయశ్రీ కాలనీలోని శ్రీపద్మావతి గోదా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అష్టమ వార్షిక అధ్యయన బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రి ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలు 30వ తేదీ నుంచి ఏప్రిల్ 6వ తేదీ శనివారం వరకు జరుగుతాయని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జొన్నాడ మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ చీర్క నర్సిరెడ్డి తెలిపారు. 4వ తేదీ (గురువారం) ఉదయం 11 గంటలకు సీతారాముల ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు, రాత్రి 7 గంటలకు వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహిస్తామన్నారు. సమీప కాలనీలవాసులు పెద్దసంఖ్యలో హాజరై బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజారులలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాటా 15, వంకాయ 18, బెండ 40, పచ్చి మిర్చి 55, కాకర 35, బీర 35, క్యాబేజి 20, ఫ్రెంచి బీన్స్ 55, క్యారెట్ 20, దొండ 18–23, చిక్కుడు 28–50, గోకర 23, బీట్‌రూట్ 19, క్యాప్సికం 65, ఆలు 33, దోస 16, సొర 7.

సామాజిక సేవాలో అందరూ భాగస్వాములు కావాలి


వైదేహి ఆశ్రమానికి స్కూటీని అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

సైదాబాద్: సామాజిక సేవా కార్యక్రమాల్లో అందరూ భాగస్వామ్యం కావాలని అసోసియేషన్ ఫర్ ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ సెటిల్డ్ ఎట్ హైదరాబాద్ కన్వీనర్ డి.మీరంశెట్టి సూచించారు. ఆదివారం ఐఎస్‌సదన్ డివిజన్ సరస్వతీనగర్ కాలనీలోని వైదేహి ఆశ్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆశ్రమ బాలికల సౌకర్యార్థం సంస్థ ప్రతినిధులు రూ. లక్షా ఇరవై వేల విలువైన యాక్టివా స్కూటీని అందజేశారు. ఈ సందర్భంగా మీరంశెట్టి మాట్లాడుతూ, తమ సంస్థ తరపున ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, భవిష్యత్‌లోనూ వాటిని కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ కో కన్వీనర్ జి.రాఘవేంద్రరావు, అధ్యక్షుడు నళినీ మోహన్ పాల్గొన్నారు.

బస్తీ సమస్యలు పరిష్కరించకపోతే ఎన్నికలు బహిష్కరిస్తాం..


సమావేశంలో మాట్లాడుతున్న మల్లోజు రవి

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని రోషన్‌దౌలా బస్తీలోని సమస్యలను 45 రోజుల్లోగా పరిష్కరించకపోతే రానున్న పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరిస్తామని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లోజు రవి అన్నారు. బస్తీలో స్థానికులతో కలిసి ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తమ కాలనీ నగరం నడిబొడ్డున ఉన్నా గత 22 సంవత్సరాలుగా కనీస వసతులు లేవని , కనీసం ఇంటింటికీ నల్లా కనెక్షన్ కూడా లేని దుర్భర స్థితిలో ఉన్నామన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని అధికారుల దగ్గరకు వెళ్తే కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని, తక్షణమే తమ కాలనీ సమస్యలను పరిష్కరించకపోతే పార్లమెంటు ఎన్నికలను బహిష్కరిస్తామని సమావేశంలో పాల్గొన్న మహిళలు హెచ్చరించారు. మల్కాజిగిరి ఎంపీగా సేవలందించిన సీఎం రేవంత్‌రెడ్డికి తమ కాలనీ సమస్యలన్నీ తెలుసని, తమ కాలనీని అభివృద్ధి చేయాలని, లేకుంటే ఇక్కడ నుంచి తమ కాలనీని వేరేచోటికి తరలించాలని సీఎంకు మల్లోజు రవి విజ్ఞప్తి చేశారు.

'దర్పల్లి' ఎందుకు డుమ్మా కొట్టారు?

- డివిజన్ కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చ
- పార్టీలో ప్రాధాన్యం ఇవ్వనందుకే అంటున్న ఆయన అనుచరులు

లింగోజిగూడ: కర్మన్‌ఘాట్‌లోని కొత్తకాపు యాదవరెడ్డి గార్డెన్స్‌లో ఆదివారం టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎల్‌బీనగర్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశానికి కాంగ్రెస్ పార్టీ జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి డుమ్మా కొట్టడంపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో చర్చ జరుగుతోంది. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నియోజకవర్గ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన తొలి సమావేశానికి కార్పొరేటర్‌తో పాటు డివిజన్ పరిధిలోని పలువురు ముఖ్య నాయకులు కూడా హాజరు కాకపోవడంపై పార్టీ నాయకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సమావేశానికి రాజశేఖర్ రెడ్డి హాజరు కాకపోవడానికి గల కారణం ఏమై ఉంటుందని నాయకులు ఆరా తీస్తున్నారు. అయితే, నియోజకవర్గంలో నిర్వహిస్తున్న పార్టీ కార్యక్రమాల్లో రాజశేఖర్‌రెడ్డికి తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆయన అనుచరులు ఆరోపిస్తున్నారు. స్థానిక కార్పొ రేటర్ అయిన తనను కాదని, ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన మాజీ కార్పొరేటర్‌తో కలిసి లింగోజిగూడ డివిజన్‌లోని పలు కాలనీల్లో పట్నం మహేందర్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించడంపై రాజశేఖర్‌రెడ్డి గుర్రుగా ఉన్నారని కాంగ్రెస్ నాయకులు గుసగుసలాడుకుంటున్నారు. అంతేకాకుండా నియోజకవర్గ స్థాయి సమావేశం గురించి ఆలస్యంగా సమాచారం ఇవ్వడం, బ్యానర్లలో కూడా రాజశేఖర్ రెడ్డికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని ఆయన అనుచరులు ఆరోపిస్తున్నారు. తనకు సమాచారం ఇవ్వకుండానే డివిజన్‌కు చెందిన పలువురు ఇతర పార్టీల నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకోవడం, పాత నాయకులకు కాకుండా పార్టీలో ఇటీవల చేరిన వారికి ప్రాధాన్యం ఇవ్వడంపై కూడా ఆయన అసహనంగా ఉన్నారని, ఈ నేపథ్యంలోనే రాజశేఖర్‌రెడ్డి పార్టీ సమావేశానికి హాజరు కాలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కొనసాగుతున్న పారిశుద్ధ్య స్పెషల్ డ్రైవ్



ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ సిబ్బంది పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. చెత్తచెదారం, పిచ్చిచెట్లు, మురికినీరు, ప్లాస్టిక్ కవర్లతో దుర్గంధం వెదజల్లుతున్నా పలు బస్తీలు, కాలనీల పరిసరాలు స్పెషల్ డ్రైవ్‌తో శుభ్రం అవుతున్నాయి. సుమారు నెల రోజులుగా పట్టణంలోని 24 వార్డుల్లోని చెత్తాచెదారాన్ని తొలగించడంలోనే పారిశుద్ధ్య సిబ్బంది నిమగ్నమైంది. మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని స్పెషల్ డ్రైవ్‌పై దృష్టి పెట్టారు. చెత్తాచెదారం, పిచ్చి చెట్లుతో పాటు దుర్వాసనతో నిండి ఉండే ఇబ్రహీంపట్నం (కృష్ణ వాటర్ పైప్‌లైన్) బైపాస్ రోడ్డును క్లీన్ చేశారు. దోమల, ఈగల వ్యాప్తి చెందకుండా, పరిసరాల పరిశుభ్రంగా ఉండేందుకు తీసుకుంటున్న చర్యలను స్థానికులు అభినందిస్తున్నారు. ప్రజలు కూడా తమకు సహకరించాలని మున్సిపల్ యంత్రాంగం కోరుతోంది. తడి,పొడి చెత్తను వేరు చేసి, ఇంటి ముందుకు వచ్చే మున్సిపల్ వాహనాల్లో వేయాలని కోరుతున్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

మలక్‌పేట: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. మలక్‌పేట పోలీస్ స్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేసిన డాక్టర్ కేవీ ఎస్ ఎస్ అడ్వాన్సడ్ వూండ్ హీలింగ్ క్లినిక్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. తెలంగాణలో ప్రతి నెలా మధుమేహం కారణంగా 300 నుంచి 500 మంది పాదాలు, కాళ్లు కోల్పోతున్నారని గణంకాలు చెబుతున్నాయన్నారు. నమ్మకంతో కూడిన చికిత్స అందించాలని క్లినిక్ నిర్వాహకులు డాక్టర్ సంతోష్ మూర్తి, డాక్టర్ రిషికేష్‌లకు సూచించారు.

కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలి


కేఎల్‌ఆర్, దేప భాస్కర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రామకృష్ణాపురం డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు యాదవ్ రెడ్డి, లింగస్వామి గౌడ్ శ్రీనివాసులు, పగడాల ఎల్లయ్య, శ్యాంసుందర్ గౌడ్, శ్రీనివాసులుతో పాటు పలువురు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, దేప భాస్కర్ రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా గత పదేళ్ల బీజేపీ దోపిడీ పాలనతో ప్రజలు విసిగి పోయారని అన్నారు. ఈ నేపథ్యంలోనే ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీనీ చేవెళ్ల పార్లమెంట్‌తో పాటు దేశ వ్యాప్తంగా భారీ మెజారిటీ గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. రమేష్, మధు యాదవ్, శంకర్, సుజాతారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, కృష్ణారావు, అంజరావ్, స్వామి గౌడ్ సాయి తేజ రెడ్డి, పురుష రాజ్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో రామకృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, పిట్ట హరినాథ్ రెడ్డి రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్ రావు, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు బొద్దుపల్లి మహేందర్ పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటా గెలిపించండి: ఈటల


వనస్థలిపురం పనామా చౌరస్తాలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఈటల రాజేందర్

వనస్థలిపురం: త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి ఎంపీ నియోజకవర్గంలో బీజేపీకి ఓటు వేసి తనను గెలిపించాలని, అందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని ఆ పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం వనస్థలిపురం డివిజన్ ఎఫ్‌సీఐ కాలనీలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నూతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కమ్మ కుటుంబ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ, కమ్మ కుటుంబ సభ్యులు అందరికీ అండగా ఉంటానని, వారి సంక్షేమం కోసం కృషి చేస్తానని అన్నారు. అనంతరం ఆయన పనామా చౌరస్తాలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యుడు గరికిపాటి మోహన్ రావు, జిల్లా (అర్బన్) అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు కొత్త రవీందర్‌గౌడ్, యలమంచిలి భానుప్రసాద్, బాలాజీనాథ్, సంరెడ్డి బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికనేత మహేశ్ సేవలు ప్రశంసనీయం: సంరెడ్డి


చవ్వ మహేశ్ దంపతులను సన్మానిస్తున్న సురేందర్‌రెడ్డి

సైదాబాద్: భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) నాయకుడిగా చవ్వ మహేశ్ కార్మికులకు అందించిన సేవలు ప్రశంసనీయమని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి కొనియాడారు. చంచల్‌గూడలోని ప్రభుత్వ ముద్రణాలయం డీటీపీ విభాగం జూనియర్ మేనేజర్ హోదాలో మహేశ్ ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆదివారం ఐఎస్‌సదన్ డివిజన్ వినయ్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో సంరెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ, 42 సంవత్సరాల పదవీ కాలంలో ఆయన నిరంతరం కార్మికుల శ్రేయస్సు కోసం పనిచేశారని అన్నారు. అనంతరం పలువురు కార్మిక నాయకులు మహేశ్, శ్రీలత దంపతులను ఘనంగా సత్కరించారు. బీఎంఎస్ జాతీయ నాయకుడు లక్ష్మారెడ్డి, ముద్రణాలయం రిటైర్డ్ డీజీఎం వీఆర్ ఎస్ ప్రసాద్, రమాకాంత్, రాజిరెడ్డి, పీఎస్ రావ్, పగిళ్ల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

'జ్ఞానదీప్ టవర్స్ ఫ్లాట్ ఓనర్స్' నూతన కమిటీ ఎన్నిక


చైర్మన్ జగన్నాథ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్‌ను సన్మానిస్తున్న అపార్ట్‌మెంట్ వాసులు

మలక్‌పేట: మూసారంబాగ్ జ్ఞానదీప్ టవర్స్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల, చైర్మన్‌గా పి.జగన్నాథ్‌రెడ్డి, లీగల్ అడ్వైయిజర్‌గా హరినాథ్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వై. రవీందర్, ప్రెసిడెంట్‌గా సి.ఫణి సాయన్న, వైస్ ప్రెసిడెంట్‌గా రాఘవేంద్ర రావు, ప్రధానకార్యదర్శిగా రాజేందర్‌రెడ్డి, కోశాధికారిగా సురేష్‌రెడ్డి ఎన్నికయ్యారు. అలాగే, సెక్రటరీగా పి. శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా లక్ష్మణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా దిలీప్‌రెడ్డి, వైస్ చైర్మన్లుగా భరత్‌నాయక్, హెచ్‌బీ జజు, నటరాజ్, పీఆర్‌ఓ వెంకటేశ్వర్లు, కల్చరల్ సెక్రటరీ కుమార్, ఈసీ మెంబర్లు ఎన్.శ్రీనివాస్, ఎస్‌డీ ఖాలేష్, ఎస్.రాజును ఎన్నుకున్నారు. కాగా, ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన కమిటీ సభ్యులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అధికారులు ప్రజాప్రతినిధుల సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి తుర్కయంజాల్‌లోని హరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నేటి నుంచి 4వ వరకు కొనసాగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం 4.30 గంటలకు గణపతి పూజ, గణపతి, సుబ్రమణ్యస్వామి, పార్వతి పరమేశ్వరులు, సత్యనారాయణ స్వామి, అభయాంజనేయ స్వామి, నవగ్రహాల విగ్రహాల ఊరేగింపు నిర్వహించనున్నారు. 2న ఉ. 8 గంటలకు గణపతి పూజ, అఖండ దీపారాధన, అగ్నిప్రతిష్ఠ, అన్నప్రసాద వితరణ, సాయంత్రం 5 గంటలకు మండప పూజలు, విగ్రహాలకు క్షీరాధివాసం, అవాహిత దేవత హోమాలు, 3న మూల మంత్ర హోమాలు, ధాన్యాధివాసం, 4న ఉదయం 6 గంటలకు ప్రాతకాల పూజలు, 7 గంటలకు యంత్ర ప్రతిష్ఠ విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు తెలిపారు.